# కథాకేళి

# మర్డర్

## మల్లాది వెంకటకృష్ణమూర్తి



తన భార్యని హత్య చేయాలన్న ఆలోచన వెంకటేశ్వరరావుకి ఆలస్యంగా వచ్చింది.

ఆమెని వెంకటేశ్వరరావు పెళ్ళి చేసుకుంది ఆమె కోసం కాదు. ఆమె ఆస్తి కోసం. ఆమె తదనంతరం ఆస్తి మొత్తం చెందేది వెంకటేశ్వరరావుకే.

అయితే తను వివాహం అయాక కాని ఆమెకి ప్రియుడున్నాడన్న సంగతి అతనికి తెలీదు. దానికి అతను ఏం బాధపడలేదు. ప్రేమలేని చోట ఈర్ష్య వుండదుగా!

ఆ రోజు పాత సామాను గదిలోని ఓ మందు సీసాని చూసాడు. దానిమీద 'విషం' అని రాసి వుంది. ఆసక్తితో చదివాడు దానితో పాటు వచ్చే ప్రింటెడ్ బ్రోషర్‌ని. సైడ్ ఎఫెక్ట్స్‌లో రాసి వుంది. అది పడకపోతే గుండె ఆగిపోతుందని, హార్ట్ ఎటాక్ అని అంతా పొరబడవచ్చుని. తన మామగారు గుండె జబ్బుకి వాడిన మందు అది.

తన భార్యని చంపాలన్న ఆలోచన ఆ మందు చూసాకే ఆలస్యంగా వచ్చింది వెంకటేశ్వరరావుకి. అది వుపయోగించి చంపితే కలిగే సౌకర్యం గుండె జబ్బుతో మరణించిందని అంతా అనుకోవడం. తనని అనుమానించరు. ఇదివరకోసారి హార్ట్ ఎటాక్ మైల్డ్‌గా వచ్చిందని కావాలంటే అబద్ధం ఆడవచ్చు తను.

ఆలస్యం విషం అమృతం అనుకున్నాడు వెంకటేశ్వరరావు.

తన భార్య తన ప్రియుడి ఇంటి నుంచి తిరిగి వచ్చే టైం దగ్గరయింది.

వెంకటేశ్వరరావు పాత సామానున్న గదిలోకి వెళ్ళి ఆ సీసాని తీసుకుని వంట గదిలోకి వెళ్ళాడు. దాన్ని ఓ మూల డబ్బాల చాటున వుంచి కాఫీకి నీళ్ళు పడేసాడు. పది నిముషాల్లో కాఫీ తయారు చేసి అందులో ఆ విషం కలిపాడు. ఆ కాఫీని ఫ్లాస్క్‌లో పోసాడు.

భార్య కోసం ఎదురుచూడసాగాడు. బయట కారు ఆగిన చప్పుడు వినిపించింది. వెంకటేశ్వరరావు డోర్ బెల్ మోగగానే వెళ్ళి తలుపు తీసాడు. భార్య వంటి మీద మంచి సెంట్ వాసన-ఆమె ప్రియుడిదని ఇట్టే గ్రహించాడు. తనకి ఆ రహస్యం తెలుసని తన భార్యకి తెలుసని, అయినా కేర్ చేయదని వెంకటేశ్వరరావుకి తెలుసు.

వంటగదిలోకి కాఫీ కలుపుకో డానికి వెళ్ళింది అతని భార్య. వెంకటేశ్వరరావు సాధ్యమైనంత మామూలుగా చెప్పాడు.

"కాఫీ కావాలంటే ఫ్లాస్క్‌లో వుంది. నువ్వొచ్చేముందే తాగాలనిపించి కలుపుకున్నాను."

కొద్ది క్షణాల్లో కాఫీ కప్పు నిండా కాఫీతో వచ్చింది మిసెస్ వెంకటేశ్వరావు.

"ఏం ఇవాళ కాఫీ తాగాలన్న బుద్ధి పుట్టింది మీకు?" అడిగింది నవ్వుతూ.

"మందు రాత్రి తప్ప పగలు తాగను" అన్నాడు వెంకటేశ్వరరావు.

వెంకటేశ్వరరావుకి ఆమె ఇచ్చే వరం - సౌకర్యం అదొక్కటే. ఎప్పుడైనా వెంకటేశ్వరరావు ఆమెని బయటికి వెళ్ళద్దని ఆంక్ష పెడతాడు, ఆమె తన ప్రియుడి దగ్గరకు వెళ్ళే సమయంలో.

రాత్రి తాగడానికి బాటిల్ వుంటే అభ్యంతరం చెప్పడు కాబట్టి ఎప్పుడూ అతని కోసం ఓ బాటిల్ సిద్ధంగా వుంచుతుంది ఆమె.

కాఫీ కప్పుని పెదవుల మధ్య వుంచుకుంది. చిన్నగా వాసన చూసి దాన్ని దింపి అడిగింది.

"ఏమిటీ వాసన?"

వెంకటేశ్వరరావు గుండె కొట్టుకునే వేగం ఎక్కువైంది. తను వాసన చూడలేదు. తెలిసిపోయిందా?

"ఫ్లాస్క్ సరిగ్గా కడిగినట్లు లేదు. బాగా వాసనా?" అడిగాడు.

"అబ్బే. జస్ట్ అనిపించిందంతే."

ఆమె దాన్ని తాగడానికి మళ్ళీ నోటి దగ్గరకి తీసుకువెళ్ళగానే వెంకటేశ్వరరావు ఆమె దగ్గరకి గెంతి ఆ కప్పులోని కాఫీ ఆమె తాగకుండా లాక్కున్నాడు.

"అదేం?" అడిగింది ఆశ్చర్యంగా.

"నీకు వాసన బాగాలేదన్నావుగా. ఇంకో కప్పు చక్కగా కలిపి తెస్తాను."

వెంకటేశ్వరరావు సింక్‌లోకి ఆ కాఫీ వంపుతుంటే ఎంతో రిలీఫ్‌గా ఫీలయ్యాడు. ఛీ. ఏమిటిది? తనకివాళ ఏమైంది? ఎంత దారుణం చేయబోయాడు. అతనికి తన భార్య అది తాగి వుంటే ఏమై వుండేదో తలచుకోగానే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

వేరే కాఫీ చేసి తీసుకువెళ్ళి ఇచ్చాడు. ఆమె మౌనంగా దాన్ని తాగింది.

వెంకటేశ్వరరావు తనలోని ఎమోషనల్ కాన్‌ఫ్లిక్ట్ తగ్గాలంటే కొద్దిగా మందు తాగడం మంచిదని సించింది. ఫ్రిజ్ లోంచి ఐస్ తీసి సగం ఖాళీగా వున్న బాటిల్‌లోంచి బేగ్ సైపర్ విస్కీని గ్లాసులోకి వంచుకుని ఐస్ క్యూబ్స్ వేసుకుని భార్య దగ్గరకి వచ్చి చెప్పాడు.

"ఇవాళ సూర్యాస్తమయం కాకుండానే తాగుతున్నాను."

చిన్నగా నవ్వింది బదులుగా. మాట్లాడలేదు. ఒక్క గుక్కలో వెంకటేశ్వరరావు ఆ పెగ్‌ని తాగేసాడు. కొద్ది క్షణాల తర్వాత గుండెని చేత్తో పట్టుకుని ముందుకు వాలిపోయాడు.

కదల్లేదు వెంకటేశ్వరరావు భార్య. తన చేతిలోని కాఫీ కప్పుని పక్కన పెట్టి టెలిఫోన్ దగ్గరకి నడిచింది. ఓ నంబర్ తిప్పి చెప్పింది కంఠంలోకి ఆదుర్దాని తెచ్చుకుని.

"హలో. డాక్టర్ మీరు వెంటనే మా ఇంటికి రావాలి. మా వారికి పొద్దున్న మైల్డ్ హార్ట్ ఎటాక్ వచ్చింది. మీ దగ్గరికి వద్దామనుకుని బయలుదేర బోతుండగా గుండె పట్టుకుని పడి పోయారు. నాకు భయంగా వుంది. వెంటనే రండి."

కాఫీ కప్పు దగ్గరకి వెళ్ళి అందుకుని మరో గుక్క తాగి తన భర్త శవం వంక చూసి చిన్నగా నవ్వింది. ●



27-10-89 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక